క్లుప్తంగా

130 మందికి నేత్రపరీక్షలు



తిరువూరు: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. నూజివీడు గిఫర్డ్ మెమోరియల్ ఆస్పత్రి వైద్యులు జెమ్మిద్ షాహిన్ 130 మంది రోగులను పరీక్షించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. 52 మందికి శస్త్ర చికిత్స అవసరమున్నట్లు గుర్తించి నూజివీడు ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు సత్యసాయి సేవాసమితి కన్వీనర్ దామెర ప్రభాకరరావు తెలిపారు. నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. విస్సన్నపేట, తిరువూరు సత్యసాయి సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకున్న పోలీసులు



ఇబ్రహీంపట్నం: రేషన్ బియ్యం అక్రమ రవాణాను పోలీసులు అడ్డుకున్నారు. మండలంలోని కాచవరం గ్రామం నుంచి విసన్నపేటకు బొలేరో వాహనంలో సుమారు 20 టిక్కీలు తరలిస్తున్నారనే సమాచారంతో సీఐ పి.శ్రీను తమ సిబ్బందిని అప్రమత్తం చేశారు. దీంతో కొండపల్లి వద్ద 30వ నంబర్ హైవేపై బియ్యం తరలిస్తున్న బొలేరో వాహనం సోమవారం తెల్లవారుజామున కొండపల్లి వద్ద అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. రెవెన్యూ అధికారులతో కలసి విచారణ చేపట్టారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



మైలవరం: గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ జిల్లా చైర్ పర్సన్ టి.జమలా పూర్ణమ్మ తెలిపారు. మైలవరం శాఖా గ్రంథాలయాన్ని ఆమె సోమవారం తనిఖీ చేశారు. సిబ్బంది, పాఠకులను గ్రంథాలయంలోని వసతులు, సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు.

కోర్టు సిబ్బంది సేవలు ప్రశంసనీయం



మైలవరం: మైలవరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో విధులు నిర్వహించిన సిబ్బంది సేవలు ప్రశంసనీయమని మైలవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముల్లంగి రవికుమార్ తెలిపారు. మైలవరం కోర్టు సిబ్బంది బదిలీపై ఎస్. కుటుంబరావు నూజివీడు కోర్టుకు, తులసీనాయుడు బంటుమిల్లి కోర్టుకు వెళుతున్న సందర్భంగా స్థానిక కోర్టు ప్రాంగణంలో మైలవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం వారిని న్యాయవాదులు సత్కరించారు. ఎంతో కాలంగా ఇక్కడ విధులు నిర్వహిస్తూ తమలో ఒకరిగా కలిసిపోయారని, కార్యాలయాల్లో పనిచేసే వారికి బదిలీలు తప్పవని పేర్కొన్నారు. కార్యక్రమంలో మైలవరం కోర్టు సూపరింటెండెంట్ కే రవికుమార్, న్యాయవాదులు బుద్దవరపు వెంకట్రావు, పీ రాము, ఎం. తనూజ్ పాల్గొన్నారు.

మహాసంగ్రామ యాత్రకు ఘనస్వాగతం



ఇబ్రహీంపట్నం: ఎస్సీ వర్గీకరణ ఈ పార్లమెంటు సమావేశాల్లో ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సుధీర్ మాదిగ చేపట్టిన పాదయాత్ర సోమవారం ఇబ్రహీంపట్నం చేరింది. ఈ సందర్భంగా ఆ సంఘ మండల, జిల్లా ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. శక్తినగర్‌లోని బీఆర్ అంబేడ్కర్, బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఏప్రియల్ 3న రాష్ట్ర బీజేపీ కార్యాలయం వద్ద మాదిగల మహాధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు మాదిగ, కోట దానియేలు మాదిగ, ఎం.విజయ్ మాదిగ, వార్డు కౌన్సిలర్ నల్లమోతు లక్ష్మీ, రవి పాల్గొన్నారు.

దేదీప్యమానంగా వేణుగోపాలుడి సన్నిధి



విద్యుత్ కాంతులతో వేణుగోపాలస్వామి ఆలయం



కల్యాణ వేదిక ప్రాంతంలో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల చిత్రాలు



ఎదుర్కోలు ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

బ్రహ్మోత్సవాల సందర్భంగా నెమలి వేణుగోపాలస్వామి ఆలయం విద్యుద్ దీప కాంతులతో మెరిమిట్లు గొల్పుతోంది. కల్యాణోత్సవం జరిగే ప్రాంతంలో వివిధ దేవతామూర్తులకు చెందిన చిత్రాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. వేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి ఎదుర్కోలు ఉత్సవం ఘనంగా నిర్వహించారు.

– నెమలి(గంపలగూడెం)

స్థానిక సంస్థల ఖాళీలకు త్వరలో ఎన్నికలు

ఆగిరిపల్లి: మండలంలోని స్థానిక సంస్థల్లో ఖాళీలకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.వాణి సోమవారం తెలిపారు. అడవినెక్కలం సర్పంచ్ స్థానానికి, ఈదులగూడెంలోని పంచాయతీ ఏడో వార్డుకు, ఎస్‌ఏపేటలో నాల్గో వార్డుకు, కృష్ణవరంలో ఏడో వార్డుకు, బొద్దనపల్లిలో ఎంపీటీసీ స్థానానికి ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ త్వరలోనే రానున్నట్టు తెలిపారు. డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ పబ్లికేషన్, శుక్రవారం పోలింగ్ స్టేషన్లపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద వార్డు సభ్యులు, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుల ఖాళీల ఉప ఎన్నికల నిర్వహణపై పోలింగ్ కేంద్రాల గురించి నోటీసు బోర్డులో ఉంచినట్టు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ్ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శులు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ బి.ప్రసాద్ పాల్గొన్నారు.

చేప వ్యర్థాలు, బెల్లంతో చీడ పీడల నివారణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చాట్రాయి: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా చేపలు, బెల్లంతో చీడ పీడలను నివారించవచ్చునని ప్రకృతి వ్యవసాయ శాఖ మండ ఇన్‌చార్జి చంటిబాబు తెలిపారు. సోమవారం మండలంలోని చాట్రాయిలో చేప, బెల్లంతో చీడ పీడల నివారణపై అవగాహన కల్పించారు. చేప వ్యర్థాలు, బెల్లం నానపెట్టి ఐదు రోజుల తర్వాత వడకట్టి పైర్లపై పిచికారీ చేస్తే చీడ పీడలను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు అర్జునరావు, శ్రీను, చక్రధరరావు పాల్గొన్నారు.

తపాలా శాఖలో అవకతవకలపై విచారణ



ఖాతాదారుల నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారి శ్రీనివాసరావు

రెడ్డిగూడెం: స్థానిక తపాలాశాఖ కార్యాలయ పోస్టుమాస్టర్ పెద్దగమళ్ల రమేష్‌బాబు ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఇటీవల పురుగుల మందు తాగాడు. ఈ నేపథ్యంలో తపాలాశాఖ ఉన్నతాధికారులు ఆ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పి.శ్రీనివాసరావుతో సోమవారం విచారణ నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న ఖాతాదారులు తపాలాశాఖకు చేరుకుని పోస్టుమాస్టర్ రమేష్ తమ వద్ద డబ్బులు తీసుకుని పోస్టాఫీసులో జమ చేయలేదని వాపోయారు. మరి కొంతమంది ఖాతాదారులు తాము డబ్బు తీసుకోకుండానే తీసుకున్నట్లు ఉందని తమకు న్యాయం చేయాలని విచారణ అధికారికి విన్నవించారు. విచారణ అధికారి ఖాతాదారుల వద్ద నుంచి ఫిర్యాదు తీసుకుని డిపాజిట్ ఫారాలపై ఉన్న సంతకాలను వెరిఫికేషన్ చేసి, ఖాతాదారులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక తపాలాశాఖలో పోస్టుమాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రమేష్‌బాబు పరారీలో ఉన్నాడని, అకౌంట్లు మొత్తం వెరిఫికేషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. విచారణ పూర్తయిన తర్వాత నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రమేష్‌బాబుపై చర్యలు తీసుకుని ఖాతాదారులకు న్యాయం చేస్తామని తెలిపారు.

అంగన్‌వాడీల్లోనే చిన్నారుల బాల్యం పదిలం

ముసునూరు: ప్రభుత్వ నూతన విద్యా విధానంతో అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారుల బాల్యం పదిలమని వక్తలు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా పలు అంగన్వాడీ కేంద్రాల్లో ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ దినోత్సవాలను సోమవారం నిర్వహించారు. చిన్నారుల విద్యాభ్యాసాన్ని, ప్రగతిని, వారి తల్లులకు వివరించారు. కార్యక్రమాల్లో సూపర్ వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళలను సత్కరిస్తున్న చిల్డ్రన్స్ స్కూల్స్, ట్యుటోరియల్స్ ప్రతినిధులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని గ్రంథాలయ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రావి శారద అన్నారు. కొండపల్లిలో విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్, ట్యుటోరియల్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళలకు సత్కార కార్యక్రమం సోమవారం జరిగింది. ఆమె మాట్లాడుతూ మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ పరంగా అభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం మహిళలకు క్రీడాపోటీలు నిర్వహించారు. మహిళలను సత్కరించారు. ఎంఈఓ పుష్పలత, దేవినేని కిషోర్‌కుమార్, జోనీకుమారి, సాంబశివరావు, చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, అమ్మాజీ పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మహిళలు అన్నిరంగాల్లో పురుషుల కంటే ముందుండాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.వీరకోటి అన్నారు. మండలంలోని చాట్రాయి జెడ్పీ హైస్కూల్లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. అనంతరం కె.స్వర్ణకుమారి, మెరీనా రాణి, ఎన్ స్రవంతి, జి.అనితలను సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు పెద్ద రమేష్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయురాలను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు

యూటీఎఫ్ ఆధ్వర్యంలో..

రెడ్డిగూడెం: మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలను యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ మినేని దేవి ప్రవణ్య మాట్లాడారు. రంగాపురం సర్పంచ్ పడిశాల సునీల, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి భవానీ, ఉమామహేశ్వరి, మేరీ పాల్గొన్నారు.

డ్రోన్ సర్వేతో సరిహద్దుల నిర్ధారణ



కొత్తగూడెంలో డ్రోన్ సర్వేని ప్రాంభిస్తున్న అధికారులు

చాట్రాయి: డ్రోన్ సర్వేతో భూముల సరిహద్దుల నిర్ధారణ చేయనున్నట్టు తహసీల్దార్ విశ్వనాథరావు తెలిపారు. సోమవారం చాట్రాయి మండలం కొత్తగూడెంలో జగనన్న భూ సమగ్ర రీ సర్వేలో భాగంగా డ్రోన్ సర్వేను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో మ్యాప్ ద్వారా భూమి సరిహద్దులు గుర్తిస్తుందని, తద్వారా దీర్ఘకాలంగా పేరుకుపోయిన భూ సరిహద్దులు పరిష్కారం అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో డివిజినల్ సర్వేయర్ వరహాల రాజు, మండల సర్వేయర్ లక్ష్మీ నారాయణ, కొత్తగూడెం, సోమవరం గ్రామాల సర్పంచ్‌లు చల్లగుళ్ల వెంకటేశ్వరావు, ఉప్పాల సోమేశ్వరావు, ఎంపీటీసీ సభ్యుడు జగన్‌మోహనరావు, ఈఓపీఆర్‌డీ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు నిస్సాక్ ఆలీ, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

ఇబ్రహీంపట్నం: పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకున్న ఓ జంట ఇబ్రహీంపట్నం పోలీసులను సోమవారం ఆశ్రయించింది. స్థానిక ఫెర్రీ గ్రామానికి చెందిన వీరాంజనేయులు విజయవాడ రాజీవ్‌నగర్‌కు చెందిన ఓ యువతితో ఇన్‌స్టాగామ్ ద్వారా పరిచయం ఏర్పడింది. పరిచయం ప్రేమగా మారడంతో వివాహానికి ఇరు కుటుంబాల పెద్దలు అడ్డుచెప్పారు. స్థానిక జూపూడి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రేమవివాహం చేసుకున్నారు. రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించారు.

తప్పిన పెనుప్రమాదం

ఇబ్రహీంపట్నం: బూడిద లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రమాదానికి కారణమయ్యాడు. ఖిల్లారోడ్డు సమీపంలో సోమవారం బూడిద అన్‌లోడ్ చేసిన తర్వాత లారీబాడీ లిఫ్ట్ దించకుండా హైవే పైకి తెచ్చాడు. 30 అడుగుల ఎత్తులో ఉన్న లారీబాడీ తగలడంతో చెట్లు, విద్యుత్ తీగలు తెగి లారీపై పడ్డాయి. నిర్లక్ష్యంగా వ్యవహరించిన డ్రైవర్ తీగలను చేత్తోపట్టుకుని తప్పించే ప్రయత్నం చేశాడు. స్థానికులు డ్రైవర్‌ను చివాట్లు పెట్టి పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అక్కడకు చేరకున్న అధికారులు విద్యుత్ తీగలు తప్పించి ప్రమాదాన్ని నివారించారు. స్థానికుల అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది.

ఎన్ఆర్‌ఐలో పీపుల్స్ ఎడ్యుకేషన్ సదస్సు

ఆగిరిపల్లి: మండలంలోని పోతవరప్పాడు ఎన్ఆర్‌ఐ ఇంజినీరింగు కళాశాలలో ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అవగాహన సదస్సు 'పీపుల్స్ ఎడ్యుకేషన్' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో కేవీఐసీ అసోసియేట్ డైరెక్టర్ ఏజీ రావు మాట్లాడుతూ విద్యార్థులకు తయారీరంగ కార్యకలాపాలకు, సేవా రంగ కార్యకలాపాలకు బ్యాంకు రుణాలు, మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 35 శాతం వరకు ప్రభుత్వ సబ్సిడీ కల్పిస్తామని తెలిపారు. కళాశాల చైర్మన్ ఆర్.వెంకట్రావు, ప్రిన్సిపాల్ సి.నాగభాస్కర్, విశాఖపట్నం కేవీఐసీ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

అవగాహన ఉండాలి

మైలవరం: విద్యార్థులకు ప్రయోగశాలలపై అవగాహన ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం స్కూల్ టు ల్యాబ్ కార్యక్రమం జరిగింది. డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర ప్రయోగశాలను సోమవారం సందర్శించారు. రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఫణికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం నిర్వహించారు.

నేడు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాలు

ముసునూరు: బాసవరప్పాడులో గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మల కల్యాణం, ముసునూరులోని అలివేలు మంగమ్మ, వెంకటాచలస్వామి కల్యాణాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీల సభ్యులు తెలిపారు. మంగళవారం ఉదయం కల్యాణం, అన్నదానం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

చట్ట బద్ధత కల్పించాల్సిన బాధ్యత బీజేపీదే

ముసునూరు: ఎస్సీలను వర్గీకరించే నిబంధనకు చట్ట బద్ధత కల్పించాల్సిన బాధ్యత బీజేపీదేనని ఎమ్మార్పీఎస్ ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ కోటేశ్వరరావు మాదిగ పేర్కొన్నారు. వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో నిర్వహిస్తున్న నిర్వహిస్తున్న పాదయాత్ర సోమవారం చెక్కపల్లి నుంచి ముసునూరులో ప్రవేశించింది. మండల కోకన్వీనర్ ఆనంద్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి తాగిన వ్యక్తులు



మాట్లాడుతున్న ఏసీపీ రమేష్, సీఐ రమేష్

మైలవరం: మైలవరం శివారులోని ఒక రియల్ ఎస్టేట్ లే-అవుట్‌లో గంజాయి తాగుతున్న ఇద్దరు వ్యక్తులను ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. మైలవరం పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ ఎల్.రమేష్ మాట్లాడుతూ సీపీ క్రాంతి రాణా టాటా ఆదేశాలతో మైలవరం డివిజన్ ఏసీపీ మారగాని రమేష్ సూచనలతో గత రాత్రి రియల్ ఎస్టేట్ లే-అవుట్‌లో గంజాయి తాగుతున్న మైలవరానికి చెందిన రాజేష్, సందీప్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద అమ్మకానికి ఉంచిన 100గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రమేష్ తెలిపారు. ఏసీపీ ఎం.రమేష్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు అమ్ముతున్నట్లు తెలిస్తే వారిపై రౌడీ షీట్లు ఓపెన్ చేస్తామన్నారు. యువత భవిష్యత్‌ని నిర్వీర్యం చేసే చర్యలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల దాడుల్లో ఏడు టన్నులు బియ్యం గుర్తింపు

విస్సన్నపేట: స్థానిక రేషన్ షాపులపై విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. మూడు రేషన్ షాపులలో నిర్వహించిన తనిఖీలలో ఏడు టన్నుల 470 కేజీలు రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు గుర్తించినట్లు విజిలెన్స్ ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రేషన్ షాపులపై దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఆర్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో పేదల జీవితాల్లో వెలుగులు

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. ఇది చూడలేని ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. మండలంలోని కొటికలపూడిలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం సోమవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎల్లో మీడియా, ప్రతిపక్షాల దుష్ప్రచారం ప్రజలు గమనించి తిప్పికొట్టాలన్నారు. అవినీతి లేని పాలనతో అమలు చేస్తున్న నవరత్న పథకాలతో ప్రతి ఇంటా సంక్షేమం వెల్లివిరిసిందన్నారు. ప్రతి ఇంట్లో ఆప్యాయంగా ఆదరించడం ఆనందం కలిగిస్తుందన్నారు. అనంతరం గడప గడపకు తిరిగి ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు, సచివాలయాల కో-ఆర్డినేటర్ లంకే అంకమోహనరావు దుర్గగుడి ట్రస్ట్ సభ్యులు చింకా శ్రీనివాసరావు, వైఎస్ ఎంపీపీ బండి నాగమణి, సర్పంచ్ నాగరాజు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొటికలపూడిలో మంగళవారం జరుగుతుందని మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు తెలిపారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పాల్గొని ప్రజలతో మమేకం అవుతారని పేర్కొన్నారు.

గడువులోపే స్పందన అర్జీలకు పరిష్కారం



అర్జీలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నూజివీడు: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై 12 అర్జీలు రాగా, వీటిలో ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఉన్నాయన్నారు. స్పందన అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వంగా వ్యవహరించొద్దని, అలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందన అర్జీలను పరిష్కరిస్తేనే ఈ కార్యక్రమం లక్ష్యం నెరవేరినట్టవుతుందని చెప్పారు. స్పందనను ప్రతి వార్డు, గ్రామ సచివాలయాల్లో ప్రతిరోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తున్నారని, అక్కడ కూడా ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేయవచ్చని తెలిపారు. ఏడీఏ విద్యాసాగర్, డీఎల్‌పీఓ పి.వెంకటరత్నం, ఏపీసీపీడీసీఎల్ డీఈ దుర్గారావు పాల్గొన్నారు.

యువ ఉత్సవ్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మైలవరం: లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు జిల్లా స్థాయి యువ ఉత్సవ్-2023 ఇండియా- 2047లో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. ఈ నెల 4న విజయవాడ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో నేస్తం జాతీయ యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం సంగతన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి యువ ఉత్సవ్‌లో పంచ్ ప్రాణ్ ఆఫ్ అమ్రిత్ కాల్ అనే ఐదు అంశాల మీద పోటీలు జరిగాయన్నారు. తమ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగానికి చెందిన ఈసీఈ విద్యార్థిని శివరాజు ఊహా జాహ్నవీ శర్మకు యంగ్ ఆర్టిస్ట్ కంటెస్ట్, ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విద్యార్థి భాను ప్రకాశ్‌కు పెయింటింగ్‌లో మూడో బహుమతి లభించిందన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ జీ. శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, వివిధ శాఖల విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

10లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

ఆర్జేడీ నాగమణి



బాలికల ట్యాబ్‌ల వినియోగం తెలుసుకుంటున్న ఆర్జేడీ నాగమణి

మూలపాడు(ఇబ్రహీంపట్నం): పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఆర్జేడీ నాగమణి ఉపాధ్యాయులకు సూచించారు. మూలపాడు జెడ్పీ పాఠశాలను సోమవారం సందర్శించారు. నాడు-నేడు పనులు, మధ్యాహ్నభోజనం పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల చదువు ప్రగతి గురించి ఆరా తీశారు. పదిమంది విద్యార్థులు వెనకబడి ఉన్నట్లు తెలుసుకుని వారిని ప్రోత్సహించి అందరూ ఉత్తీర్ణులయ్యేలా చూడాలన్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థుల ట్యాబ్‌ల వినియోగంపై ఆరా తీశారు. ట్యాబుల్లో సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలన్నారు. ట్యాబ్‌లు ఎక్కువ సమయం వినియోగిస్తున్న విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు కూడా ట్యాబులు వినియోగించాలన్నారు. ఎంఈఓ పుష్పలత పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ క్రీడాకారులకు సబ్‌కలెక్టర్ అభినందన

నూజివీడు: పట్టణానికి చెందిన పలువురు బాస్కెట్‌బాల్ క్రీడాకారులు అండర్-14, -17, -19 విభాగాల్లో ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం తరపున ఎంపికయ్యారు. వీరిని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ చదువుతో పాటు ఆటలు, క్రీడల్లో కూడా విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పీడీలు వాకా నాగరాజు, అన్నామణి, లక్ష్మీ, వాకా వనజ పాల్గొన్నారు.

వేణుగోపాలుని సేవలో మల్లు భట్టివిక్రమార్క



భట్టి విక్రమార్కకు స్వామి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్ శశిరేఖ

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాలస్వామిని తెలంగాణా రాష్ట్రం మధిర ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, ప్రధాన అర్చకులు గోపాలచార్యులు ఆయన్ను సాదరంగా ఆహ్వానించారు. ప్రత్యేకపూజలు పాల్గొన్న అనంతరం భట్టిని ప్రధాన అర్చకులు తిరునగరి గోపాల ఆచార్యులు, అర్చక బృందం ఆశీర్వదించారు. స్వామి చిత్రపటం, ప్రసాదాన్ని చైర్మన్ అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు కావూరి వినయ్‌కుమార్ పాల్గొన్నారు.